సాక్షి
వరంగల్
మంగళవారం | 17 | జూన్ | 2025



పేదల ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు

పేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మంత్రి కొండా సురేఖ అన్నారు.

- 8లో▸



బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

విద్యుత్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $32^0/25^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూభారతితో సమస్యల పరిష్కారం



పర్వతగిరి: భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. సోమవారం పర్వతగిరిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించి రైతుల నుండి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ భారతితో భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

మోహన్‌రావు సేవలు చిరస్మరణీయం

నర్సంపేట రూరల్: ప్రముఖ పారిశ్రామిక వేత్త, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆస్పత్రి స్థల దాత దొడ్డ మోహన్‌రావు సేవలు చిరస్మరణీయమని నర్సంపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ అన్నారు. నర్సంపేట మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సూపరింటెండెంట్ కిషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సిబ్బందితో కలిసి మోహన్‌రావు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో మెడికల్ కళాశాల, ఆస్పత్రి నిర్మించేందుకు భూమిని కొనుగోలు చేసి దానం చేసిన మహోన్నతమైన వ్యక్తి దొడ్డ మోహన్‌రావు అన్నారు. ఇవే కాకుండా ఎన్నో సేవలు చేశారని, వారు భౌతికంగా లేకపోయిన ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 57శాతం ఉత్తీర్ణత

విద్యారణ్యపురి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో సెకండియర్ జనరల్ విభాగంలో 1,847 మంది విద్యార్థులకు గాను 977 మంది (57.9శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈఓ శ్రీధర్‌సుమన్ తెలిపారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో బాలురు 1,104 మందికి గాను 562 మంది (50.91శాతం), బాలికలు 743 మందికి గాను 415 మంది (55.86శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో 244 మందికి 157 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అదేవిధంగా ఫస్టియర్ జనరల్ విభాగంలో 2,820 మందికి గాను 1,780 మంది విద్యార్థులు (63.12 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఒకేషనల్ కోర్సుల్లో 317 మందికి గాను 241 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈఓ తెలిపారు.

నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం

- కొండా దంపతులపై టీపీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు

వరంగల్: పార్టీని నమ్ముకున్న తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా కొండా సురేఖ దంపతులు అన్యాయం చేస్తున్నారని వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఏకరువు పెట్టారు. సోమవారం తూర్పు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వంలో హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఈసందర్భంగా పలువురు ఆయనతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లను కాదని గత ఎన్నికల్లో, గెలిచిన తర్వాత పార్టీలో వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తూ తమను నిర్లక్ష్యం చేస్తున్నారని వివరించారు. ఈవిషయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన వారిపై కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల భద్రకాళీ దేవాలయ ట్రస్ట్ బోర్డులో సైతం గెలిచిన తర్వాత వచ్చిన వారికి అవకాశం కల్పించారే తప్ప సీనియర్లను విస్మరించారని ఫిర్యాదు చేశారు. కాగా.. 'తప్పకుండా పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశాలు కల్పిస్తాం' అని మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంటల రాజు, మాజీ కార్పొరేటర్లు జన్ను అరుణ్, దూపం సంపత్, బిల్ల శ్రీకాంత్, జన్ను రవి, కరాటే ప్రభాకర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరిమి పరమేశ్, అర్బన్ అధ్యక్షుడు సలీం, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం ఎప్పుడో?

పక్క ఫొటోలోని వృద్ధులు వర్ధన్నపేట డీసీతండాకు చెందిన బానోతు అంబాలి, డాక్య దంపతులు. వీరు కష్టపడి సంపాదించిన 4 ఎకరాల భూమిని నలుగురు కొడుకులకు రాసిచ్చారు. ఇప్పుడు వృద్ధాప్యంలో వారి బాగోగులు చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అన్నం కూడా పెట్టడం లేదని, మాకు న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.





దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ప్రజావాణిలో మొరపెట్టుకున్న దరఖాస్తుదారులు

- గ్రీవెన్స్‌లో 127 వినతులు
- పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులకు పరిష్కారం ఎప్పుడోనని బాధితులు వాపోతున్నారు. సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో, కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్నా... పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, హౌసింగ్ పీడీ గణపతిలతో కలిసి ప్రజావాణి వినతులు స్వీకరించారు. మొత్తం 127 దరఖాస్తులు రాగా ఆయాశాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంవత్సరకాలంలో ప్రజల నుంచి ఇప్పటివరకు 11,221 దరఖాస్తులు రాగా 10,349 దరఖాస్తులు పరిష్కరించగా 872 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా అధికారులు త్వరగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేని సమస్యలు ఉంటే దరఖాస్తుదారుడికి అర్థం అయ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఓ ప్రెసిడెంట్, సీఈఓ రాంరెడ్డి, జనరల్‌సెక్రటరీ ఫణికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, డీఎంఅండ్‌హెచ్ఓ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్ ఉన్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు ..

అధికారుల సమష్టి కృషితో సత్ఫలితాలు సాధిస్తూ, అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందించి జిల్లాను ముందువరుసలో ఉంచుదామని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టర్‌గా డాక్టర్ సత్యశారద బాధ్యతలు స్వీకరించి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే, నేషనల్ హైవే, విమానాశ్రయం, నర్సంపేట జిల్లా ఆస్పత్రి తదితర ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను శ్రీకారం చుట్టి తుది దశకు తీసుకురావడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి



నాకు ఉండటానికి ఇల్లు లేదు. ఇప్పటివరకు గత ప్రభుత్వంలో కూడా ఇంటి కోసం దరఖాస్తులు ఇచ్చాను. నేను చిన్న ఉద్యోగం చేసుకొని జీవనం కొనసాగిస్తున్న. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

- మహ్మద్ నజీర్, 43 డివిజన్ పెన్షన్‌పూర్

బిల్లులు రావడం లేదు..



కేంద్రం ప్రభుత్వ పథకం ఆర్‌బీఎస్‌కే కోసం తమ 5 వాహనాలను కిరాయికి నడుపుతున్న. డ్రైవర్ కమ్ ఓనర్లుగా పనిచేస్తున్నాం. 9 నెలల నుంచి మాకు బిల్లులు రావడం లేదు. మా కుటుంబ పోషణ కష్టంగా మారింది. బిల్లులు ఇప్పించి ఆదుకోవాలి.

- గబ్బర్‌సింగ్, ఆర్‌బీఎస్‌కే డ్రైవర్ కమ్ ఓనర్

దివ్యాంగ పింఛన్ ఇప్పించాలి..



దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటివరకు మంజూరు కాలేదు. కష్టం చేసుకుని బతుకుతామంటే కాళ్లు పనిచేయడం లేవు. ఇప్పటికైన దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలి.

- రాపోల ఐలయ్య, ఇల్లంద

వర్షాకాలం జరభద్రం!

మొదలైన సీజనల్ వ్యాధులు

- అప్రమత్తమైన యంత్రాంగం
- ముందు జాగ్రత్తలు మేలంటున్న వైద్యులు



నర్సంపేట: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. పట్టణం, గ్రామాల్లో అపరిశుభ్రత వాతావరణంతో పలు రకాల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వ్యాధులను అరికట్టాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. జిల్లా 70 శాతం గ్రామీణ ప్రాంతంగా విస్తరించి ఉండడంతో వర్షాకాలంలో నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలుపుతూ ఇప్పటికే జ్వర సర్వే ప్రారంభించి హైరిస్క్ ప్రాంతాలను కూడా గుర్తించింది. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల నివారణకు తగు సూచనలు చేస్తుంది.

మొదలైన జ్వర సర్వే...

జిల్లాలో జ్వర సర్వేను వైద్య ఆరోగ్యశాఖ జిల్లా, మండల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని తొలగించుకోవాలని, లార్వను గుర్తిస్తూ నివారణ చర్యలు చేపడుతున్నారు. అన్ని రకాల పరీక్షల కిట్లు, మందులు అందుబాటులో ఉంచి కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. వైద్య శిబిరాలు, మందులు, నమూనాల సేకరణ, పరిశుభ్రత తదితర అంశాలను పర్యవేక్షిస్తూ జ్వరపీడితులను గుర్తిస్తున్నారు. పట్టణంలోని మురికి నీరు నిల్వ స్థలాలను గుర్తించి ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి ఉండే ప్రాంతాలను, ముంపు ప్రాంతాలను గుర్తిస్తూ హైరిస్క్ ప్రాంతాలుగా నమోదు చేసుకొని అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	డెంగీ	మలేరియా
2023	160	7
2024	321	7
2025	18	5

అన్ని జాగ్రత్తలు చేపడుతున్నాం..

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే సర్వేలు నిర్వహిస్తూ ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. ఎక్కడైనా అనారోగ్య సమస్యల తీవ్రత ఎక్కువగా ఉంటే ఆయా ప్రాంతాల్లో ఆస్పత్రుల సిబ్బందికి సమాచారం ఇస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రకాశ్ డిప్యూటీ డీఎంహెచ్ఓ

మొరాయించిన సర్వర్.. రిజిస్ట్రేషన్లకు బ్రేక్

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం ఈ-కేవైసీ ఆధార్ సర్వర్ మొరాయించింది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. తిరిగి 12.30 గంటల నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రతి రోజు సాయంత్రం 5.30 నిమిషాలకు ముగియాల్సిన రిజిస్ట్రేషన్లు 6.30 నిమిషాల వరకు కొనసాగాయి.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

నల్లబెల్లి: రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ఘన విజయం సాధించేందుకు సన్నద్ధం కావాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నల్లబెల్లి, రంగాపూర్, రుద్రగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసిన వారికి దశల వారీగా బిల్లులు చెల్లిస్తామన్నారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తాహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీఓ నర్సింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి, నాయకులు మాలోత్ రమేష్, వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లు



ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి: నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మంపేట గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, దంజ్యానాయక్, శివాజి, తిరుపతి పాల్గొన్నారు.

కట్టయ్య మృతి తీరని లోటు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నర్సంపేట: సైన్స్ మనిషి కంట కట్టయ్య మృతి తీరని లోటని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో కంచ కట్టయ్య యాది సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కంచె ఐలయ్యలు పాల్గొని కట్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలు వద్దు సైన్స్ ముద్దు అనే దిశగా ప్రయాణించి అందరికీ ఆదర్శంగా ఉన్నారన్నారు. కంచ కట్టయ్య మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్,మట్టి మనిషి కొల్లూరి సత్తయ్య, డాక్టర్ ప్రసాద్‌రావు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, గద్వాల ఇన్‌చార్జ్ సరితతిరుపతయ్య, బిషప్ జోసఫ్ డిసోజ, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ రవీందర్‌యాదవ్, ప్రొఫెసర్ రామయ్య, సీపీఎం రాష్ట్ర నాయకులు రాములు, వీరన్నయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కట్టయ్య యాదిసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

పాకాల ఆయకట్టు కింద త్వరగా నాట్లు వేయాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



ముఖాముఖిలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రైతులు

ఖానాపురం: పాకాల ఆయకట్టు కింద త్వరగా నాట్లు వేసుకోవాలని రైతులకు అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. సోమవారం మండలంలోని ఖానాపురం, అశోక్‌నగర్, బుధరావుపేట గ్రామాల్లోని రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎంతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావులు రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ సంధ్యారాణి కూడా ప్రభుత్వ సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సౌజన్య, తహసీల్దార్ రమేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఏఓ బోగ శ్రీనివాస్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

'లేఖల' పంచాయితీ!

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్‌లకు పోటాపోటీ

- ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు, సిఫారసులు
- లూప్‌లైన్‌లో ఎంట్రీ.. ఎస్‌హెచ్‌ఓగా కీలక ఠాణాలపై కన్ను
- పైరవీలు, సిఫార్సు లేఖలపై పోలీస్ ఉన్నతాధికారి సీరియస్?
- పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా బదిలీలు, పోస్టింగులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 'లేఖ'ల పంచాయితీ నడుస్తోంది. ప్రధానంగా వరంగల్ నగర పోస్టింగ్‌ల ప్రయత్నాలు మామూలుగా లేవు. నగరానికి దూరంగా, లూప్‌లైన్‌లో ఉన్న కొందరి కుర్చీల పరుగు సహచర పోలీసులనే ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. పోటాపోటీగా చేస్తున్న ఈ ప్రయత్నాలు ఒక దశలో ఇటు రాజకీయ నాయకులు, అటు పోలీస్ ఉన్నతాధికారులకు చికాకు తెప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోస్టింగ్ పట్టడమే కాదు తెచ్చుకున్న స్థానాన్ని కాపాడుకునేందుకు కొందరు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు పడరాని పాట్లు పడుతున్నారు.మరికొందరైతే బదిలీలకు కొద్ది రోజుల ముందు కమిషనరేట్‌లో ఎంటరై లూప్‌లైన్ సీటు సంపాదించి.. ఆ వెంటనే ఆ పనిచేయకుండా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పోస్టింగ్‌ల కోసం పావులు కదుపుతున్నారు. ఎక్కడ ఎవరూ ఏం మిస్టేక్ చేస్తారా? అని మరీ లేఖలు తీసుకుని కాచుకు కూర్చుంటున్నారు. దీంతో ఠాణాలలో ఎస్‌హెచ్ఓలుగా పని చేసే పలువురు అభద్రతాభావానికి గురవుతున్నారన్న చర్చ ఆ శాఖలో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా ఉంది.

చికాకు తెప్పిస్తున్న పైరవీలు, లేఖలు..

గ్రేటర్ వరంగల్‌లోని కీలక ఠాణాల కోసం పైరవీలు, లేఖల సిఫారసులు ఉన్నతాధికారులకు తెప్పిస్తున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసి ఆరోపణలు, వివాదాస్పదంగా ఉన్న పలువురు ఇన్‌స్పెక్టర్‌లు ఇతర జిల్లాలకు వివిధ పోస్టింగ్‌లలో భాగంగా వెళ్లారు. పరిస్థితులు అనుకూలంగా మారడంతో తిరిగి మళ్లీ ఏదో ఒక కారణం.. పైరవీతో కమిషనరేట్‌లో ఎంటర్ అవుతున్నారు. వచ్చిరాగానే కీలక ఠాణాలు ఎంపిక చేసుకుని పావులు కదుపుతుండటంతో పోలీస్ ఉన్నతాధికారులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారన్న ప్రచారం ఉంది. డీసీఆర్‌బీ, పీసీఆర్, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ తదితర విభాగాల్లో ఉన్న కొందరు ఆ విభాగాలకు సంబంధించిన పనులు చేయకుండా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ లేఖలు, సిఫారసులు చేయించడం పట్ల పోలీసు ఉన్నతాధికారి చికాకు పడినట్లు తెలిసింది. చేసే పని సరిగా చేయకుండా పైరవీలు చేయించడాన్ని సీరియస్‌గా భావించిన సదరు అధికారి కొందరిని గట్టిగానే మందలించారన్న వార్త పోలీసు సర్కిళ్లలో వైరల్‌గా మారింది.



పోలీసుల పోస్టింగ్‌లపై 'అధికార' మార్కు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లు, ఏసీపీల బదిలీ వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ మార్కు ఉందన్న చర్చ ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి మరుసటి రోజునుంచే ఇక్కడ పోస్టింగ్‌ల కోసం పోటాపోటీగా పావులు కదుపుకుంటున్నారన్న చర్చ ఉంది.. ఒక ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్ఓ) పదవీకాలం ఏడాదిన్నరైన పూర్తికాక ముందే ఆ పోస్టింగ్‌లు కొట్టేందుకు వారి సహచరులే ప్రజాప్రతినిధులను కాకా పట్టిన వైనం అప్పట్లో బహిరంగంగానే మాట్లాడుకున్నారు. కాగా, ఈ పోస్టింగ్‌ల ప్రయత్నాల్లో గత ప్రభుత్వం హయాంలో పనిచేసిన కొందరు దూరంగా ఉంటుండగా.. మరికొందరి ఇప్పటికీ కీలక పోస్టింగ్‌లు పొందుతున్నారు. కోరుకున్న చోట కొలువు చేయాలనుకునే కొందరు సీఐలు ఆ ఠాణాల్లో ఖర్చీఫ్ (లేఖ)లు వేసుకుని పోస్టింగ్‌లపైనే దృష్టి పెట్టడం వల్ల వారు పనిచేస్తున్న విభాగాల్లో పనులు పెండింగ్ పడుతున్నాయి. వీటికి కారణాలేమైనా.. బదిలీలు, పోస్టింగ్‌లు జరిగినప్పుడల్లా ఆ అంశంపై పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా కీలక ఠాణాలు, సర్కిళ్లలో పోస్టింగ్‌ల కోసం సీఐల మధ్య 'కుర్చీలాట' సాగడం.. గత ఆరు నెలల వ్యవధిలో జరిగిన బదిలీల సందర్భంగా చాలామందికి స్థానచలనం కలగడం, తిరిగి మళ్లీ పోస్టింగ్‌లు పొందడం హాట్‌టాపిక్ అవుతోంది.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

- వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన



వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న సుమన్

పర్వతగిరి: మండలంలోని చెరువుకొమ్ముతండాలో సోమవారం ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపంతో గ్రామానికి చెందిన ధారావత్ సుమన్ అనే వ్యక్తి వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. అధికారులు, స్థానిక నాయకులు ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని హామీ ఇచ్చే వరకు దిగేది లేదని సుమన్ స్పష్టం చేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని సుమన్ నచ్చజెప్పి కిందికి దించారు. అనంతరం ఎస్సై బోగం ప్రవీణ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుడు సుమన్ మాట్లాడుతూ గతంలో తన ఇల్లు విద్యుదాఘాతంతో కాలిపోయిందని, అర్హులైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని అన్నారు.

సంస్కృతిని చాటి చెప్పే శక్తి సాహిత్యానికే ఉంది

- కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ రవీందర్

నర్సంపేట: తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే గొప్ప శక్తి సాహిత్యానికి ఉందని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ప్రముఖ యువ రచయిత, గాయకుడు పడిదం రాజేందర్ రాసిన అస్మక రాజ్యమే నా తెలంగాణ అనే గేయ కావ్య పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాచీన చరిత్రను జల్లెడ పట్టి నేటి ఆధునిక వ్యవస్థను వర్ణిస్తూ తనదైన శైలిలో భావవ్యక్తీకరణ తెలియజేసిన గొప్ప రచయిత రాజేందర్ అని కొనియాడారు. ఇలాంటి అనేక పాటలు రాసి రాష్ట్రం, దేశంలో గొప్ప కవి,రచయితగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కవి గాయకుడు డాక్టర్ శరత్‌చమర్, యోచన, రామంచ భరత్, తాళ్ల సునీల్, రేలా కుమార్, జూపాక శివ, గాదెపాక బాబు, మారముళ్ల ఆనందం, వేదాంత్ మౌర్య, జనగాం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవీందర్

నేటినుంచి టీజీఈసెట్ కౌన్సెలింగ్

రామన్నపేట: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో డిప్లొమా విద్యార్థులకు రెండో సంవత్సరం బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం టీజీఈసెట్ కౌన్సెలింగ్ నేటి (మంగళవారం) నుంచి ప్రారంభం కానున్నట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, టీజీఈసెట్ క్యాంప్ ఆఫీసర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈనెల 17 నుంచి 19 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ (స్లాట్ బుక్ చేసిన అభ్యర్థులకు), 17 నుంచి 21 వరకు ఆప్షన్ల ఎంపిక (కళాశాలు, కోర్సులు), 21న ఆప్షన్ల ఫ్రీజింగ్, 25వ తేదీలోపు సీట్ల తాత్కాలిక కేటాయింపు, 29 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ ఉంటుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్సెస్సీ మెమో, డిప్లొమా సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టీసీ, తదితర సర్టిఫికెట్లు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు htttps:// tgecet.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



హన్మకొండ : విద్యుత్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈ (టెక్నికల్), సేఫ్టీ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పనులు చేస్తున్న సమయంలో భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్లు, వంగిన, తుప్పు పట్టిన స్తంభాలు గుర్తించి మార్చాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచాలని, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ లైన్లను గుర్తించి మార్చాలన్నారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. అధికారులు తమ సర్కిళ్ల పరిధిలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల నివారణపై విస్తృత ప్రచారం కల్పించి వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రైతులు స్వయంగా విద్యుత్ సంబంధ పనులు చేయొద్దని, అవసరమైతే 1912కు ఫోన్ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో చీఫ్ ఇంజనీర్లు, రాజు చౌహాన్, అశోక్, వెంకటరమణ, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డీఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరికి అవకాశం లేదు!

జువాలజీ విభాగంలో ఇప్పటికే ఉద్యోగాల నుంచి తొలగించబడిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మాత్రం ప్రభుత్వం అవకాశం కల్పించలేదు. దీంతో వీరిద్దరిని మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునే అవకాశం ఉండబోదని భావిస్తున్నారు. ఆ ఇద్దరిని మినహాయించి మిగతా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక అంశంపైనే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై
సర్కారు సానుకూలత

నేడు కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదం లభించే అవకాశం?



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం(సర్కారు) సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు ఈ ఏడాది మే 8న యూనివర్సిటీకి సంబంధిత జీఓ అందింది. దీనిని యూనివర్సిటీ అధికారులు కూడా ధ్రువీకరించారు. కేయూలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ (సీఎస్) తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఈఏడాది ఫిబ్రవరి 24న అప్పటి సీఎస్ను ఆదేశించిన విషయం విదితమే. అప్పట్లోనే వారం రోజులపాటు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అలాగే వీరి నియామకాలపై వ్యతిరేకంగా కోర్టు ను ఆశ్రయించిన వారు కూడా తమ అభ్యర్థలను సీఎస్కు విన్నవించుకునే అవకాశం కల్పించింది. రెండు నెలల్లో తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు కూడా అప్పట్లోనే పేర్కొంది. చివరికి ప్రభుత్వం అంతర్గతంగా కమిటీని నియమించి వీరి నియామకాలపై పరిశీలన జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. చివరికి ప్రభుత్వం ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై సానుకూల నిర్ణయం తీసుకుని ఈఏడాది మే 8న జీఓ జారీచేసి దానిని యూనివర్సిటీ రిజిస్ట్రార్కు పంపింది.

నేడు ఆమోదం లభించేనా?

కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియమితులైన వివిధ విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై అప్పటి నుంచి వివాదం కొనసాగుతూనే ఉంది. 38 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను అప్పట్లో వివిధ విభాగాల్లో నియమించారు. అప్పట్లోనే ఉద్యోగాలు రాని పలువురు అభ్యర్థులు ఈ నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో చివరికి పూర్తిస్థాయి పాలకమండలి సమావేశంలో ఆమోదించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. 2019 నవంబర్లో కేయూ పూర్తిస్థాయి పాలకమండలి సమావేశంలో ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై చర్చించారు. అవకతవకలు చోటుచేసుకున్నాయని భావించి వీరి నియామకాన్ని అప్పట్లో కేయూ పాలకమండలి సమావేశం ఆమోదించ లేదు. దీంతో అప్పటి కేయూ రిజిస్ట్రార్ పురుషోత్తం ఈ నియామకాలపై తుదినిర్ణయం తీసుకోవాలని, అప్పట్లోనే ఫైల్ను ప్రభుత్వానికి పంపారు. అప్పటి నుంచి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం జాప్యం చేసింది. చివరికి ఆ తర్వాత జరిగిన పరిణామల నేపథ్యంలో కోర్టు ఆదేశాలతో జువాలజీ విభాగానికి చెందిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను యూనివర్సిటీ అధికారులు కొంత కాలం క్రితమే ఉద్యోగాల నుంచి తొలగించిన విషయం విదితమే. ఆ తర్వాత కూడా అప్పట్లో ఉద్యోగం రాని అభ్యర్థిని ఒకరు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే మిగతా పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ ఉద్యోగాలు కాపాడుకోవడం కోసం కూడా హైకోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో చివరికి సుప్రీంకోర్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఆదేశించింది. దీంతో ప్రభుత్వం ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై (అప్రూవల్ చేస్తూ) సానుకూల నిర్ణయం తీసుకుని జీఓను ఈఏడాది మే 8 యూనివర్సిటీ అధికారులకు పంపింది. అందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం పేర్కొనట్లు సమాచారం. ఈ క్రమంలో నేడు(ఈనెల 17న) హైదరాబాద్లో కేయూ పాలకమండలి సమావేశం నిర్వహించబోతున్నారు. ఇందులో 2010లో నియమితులైన ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలను చర్చించి ఆమోదించేందుకు పాలకమండలిలో ప్రవేశపెట్టబోతున్నారు. ఈ మేరకు ఏజెండా కూడా పెట్టారు. పాలకమండలి ఆమోదం లభిస్తుందా లేదా అనే అంశం మంగళవారం తేలిపోనుంది. ఈ అంశంపై ఎం జరగనుందనేది యూనివర్సిటీలో చర్చగామారింది. ఆమోదం లభిస్తే ఇక రాబోయే రోజుల్లో ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించనున్నారు. అంతేగాకుండా పరిపాలన పదవుల్లో కూడా మరికొందరికి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. 15 ఏళ్లుగా ఉద్యోగంలో కొనసాగుతున్న ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు యూనివర్సిటీ అధికారులు పదోన్నతులు కల్పించడం లేదు. ఇదిలా ఉండగా ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఇప్పటికే ముగ్గురు విరమణ పొందగా మరో ఇద్దరు మరణించారు. అప్పట్లోనే ఒకరు రాజీనామా చేశారు. ఇద్దరు టర్మినేషన్ అయిన విషయం విదితమే. ప్రస్తుతం 27 మంది ప్రొఫెసర్లు ఉన్నారు.

ఆదర్శం.. కల్వల ప్రాథమిక పాఠశాల

● మూడు రోజుల్లో 65 అడ్మిషన్లు

కేసముద్రం: విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్న క్రమంలో మండలంలోని కల్వల ప్రాథమిక పాఠశాల కేవలం మూడు రోజుల్లోనే 65 అడ్మిషన్లు సాధించి ఇతర స్కూళ్లకు ఆదర్శంగా నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కల్వల ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థులుండగా ఈ విద్యా సంవత్సరం ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ఇంటింటి ప్రచారం చేశారు. దీంతో సోమవారం నాటికి 65 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఫలితంగా ఆ పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 127కి చేరింది. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సయ్యద్, వీఆర్ఏ మహేశ్, నవోదయ గెస్ట్ లెక్చరర్ తమ పిల్లలను ఇదే పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ యాదగిరి, హెచ్ఎం క్లైం వీరారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దుతామని, అనేక సౌకర్యాలు కల్పించామన్నారు.



కల్వల ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లు స్వీకరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పేదల ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు

● తొలి విడతలో 1,659 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ
● రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ చౌరస్తా : పేదల ఆత్మగౌరవ ప్రతిక సొంత ఇల్లు అని, వారి కల సాకారం చేయడానికి ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అందులో వెరిఫికేషన్ పూర్తయిన 1,659 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం వరంగల్ ఓసిటీ లోని మంత్రి క్యాంపు కార్యాలయ ఆవరణలో మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మిగతా లబ్ధిదారులకు త్వరలో అందచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూంలకు బదులు ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని మాయ మాటలు చెప్పి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నిరుపేద రూ. 5 లక్షలతో ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పుష్కరాలకు ఆంధ్రప్రదేశ్కు నిధులు అధికంగా విడుదల చేసి, తెలంగాణపై వివక్ష చూపించారని విమర్శించారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు మాట్లాడారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిప్యూటీ కమిషనర్ ప్రసునారాణి, నోడల్ అధికారి రామ్రెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా, ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీకి లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో క్యాంపు ఆఫీస్ కిక్కిరిసింది. సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో దేశాయిపేటకు చెందిన ఓ వ్యక్తి ఫిట్స్తో కింద పడిపోగా సల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న మంత్రి సురేఖ

సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

మహబూబాబాద్ రూరల్ : ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక వనరులు కష్టమైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఏ వర్గాలైతే అండగా నిలబడ్డాయో వారందరినీ కాపాడుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్టీలో కొత్త, పాత కలయికలతో ఇబ్బందులు వస్తున్నాయని, ఆ అంశాల గురించి పార్టీ పరంగా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. మంత్రివర్గ విస్తరణలో సముచిత న్యాయం కోసం ఎస్సీలోని మాదిగ, మాల వర్గాల వారికి ఏ విధంగా అవకాశం కల్పించారో, అదేవిధంగా ఎస్టీలోని ఆదివాసీలకు అవకాశం కల్పించిన విధంగా లంబాడీలకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్, నాయకులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, పద్మజ, గుగులోత్ వెంకట్ నాయక్, తోట వెంకన్న, గొల్లపల్లి ప్రభాకర్, చెన్నసీతారాములు, లకావత్ పద్మాబాయి, గుగులోత్ దేవి, భూక్య లక్ష్మి, సంపంగి రామచంద్రు, ముంజాల రాజేందర్ గౌడ్, బానోత్ ప్రసాద్, కొత్త యుగంధర్, మేకల శివ, గాడిపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్

ఓసీ-3లో నిలిచిన పనులు

● సింగరేణి యాజమాన్యం డబ్బులు చెల్లించలేదని పనులు నిలిపిన కంపెనీ

గణపురం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని పరశురాంపల్లి శివారు ఓసీ-3 ప్రాజెక్టులో బొగ్గు తవ్వకం పనులు సోమవారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్ నుంచి పూర్తిగా నిలిచాయి. ఓసీ-3 గనిలో తవ్వకం పనులు చేపట్టిన ఎస్వీఎస్ ఇంజనీరింగ్ కంపెనీకి సింగరేణి యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడంతో పనులు కంపెనీ పూర్తిగా నిలిపివేసింది. సుమారు రూ.4 కోట్ల వరకు సింగరేణి సంస్థ ఎస్వీఎస్ కంపెనీకి చెల్లించాల్సి ఉంది. అయితే ఆ డబ్బులు చెల్లించకపోవడంతో బొగ్గు, మట్టి తవ్వకం పనులు నిలిపివేశారు. డబ్బులు చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని కంపెనీ యంత్రాలు, లారీలను ఎక్కడికక్కడే నిలిపి వేసింది. రోజుకు 3వేల టన్నుల బొగ్గు, 4వేల టన్నుల మట్టి తవ్వకం పనులు నిలిచిపోవడంతో సింగరేణి సంస్థ భారీగా నష్టపోతుంది.



పనులు ఆగిపోవడంతో నిలిచిన టిప్పర్లు

కాళోజీ యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్గా కేశవ్



ఎంజీఎం : కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్గా డాక్టర్ కేశవ్ నియమితులయ్యారు. నీట్ కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియ కోసం ఐదుగురు అధికారులను డిప్యుటేషన్పై ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కేటాయించారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేశవ్, వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ప్రొఫెసర్ డి.నాగలక్ష్మి, హైదరాబాద్ ఆర్హెచ్ఎఫ్ డబ్ల్యూటీసీ కార్యాలయ పర్యవేక్షకుడు ఎం డి. ఫయాజ్, మహబూబాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పరిపాలన అధికారి బి.శ్రీనివాస్ను డిప్యుటేషన్పై కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి కేటాయించారు. ఏడాది కాలం పాటు హెల్త్ యూనివర్సిటీలో విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రాణం తీసిన భూ వివాదం

● రెండు గుంటల భూమే కారణం...
● మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య
● చిట్యాలలో ఘటన



మధునమ్మ(ఫైల్)

చిట్యాల: భూ వివాదం ప్రాణం తీసింది. రెండుగుంటల భూమి కోసం కొన్ని రోజులుగా జరుగుతున్న గొడవతో మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కట్కూరి మధునమ్మ(65)కు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా కొంత భూమి వచ్చింది. ఇందులో రెండు గుంటల భూమిని తన అన్న కుమారుడి(మేనల్లుడు)కి ఇవ్వాలని తన కుమారులు రమేశ్, శ్రీనివాస్ను కోరింది. ఈ విషయంపై వారు అంగీకరించకపోవడంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో పంచాయితీ జరిగింది. అయినా కుమారులు వినడం లేదు. దీనిపై మనస్తాపం చెందిన మధునమ్మ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు గమనించి హుటాహుటిన పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి మృతి చెందింది. కాగా, మధునమ్మ మృతికి కారణమైన కుమారులపై కేసు నమోదు చేయాలని ఆస్పత్రి ఆవరణలో కాలనీ వాసులు, బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మధునమ్మ మృతిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. మృతురాలి కుమార్తె రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రవణ్కుమార్ సోమవారం తెలిపారు.

మేకను కొనేందుకు వెళ్తూ.. మృత్యుఒడికి

● బస్సును ఢీకొన్న ఆటో.. మహిళ దుర్మరణం
● భజన తండా సమీపంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మేకను కొనేందుకు వెళ్తున్న క్రమంలో ఓ మహిళ మృత్యుఒడికి చేరింది. బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెందింది. ఈ ప్రమాదం సోమవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి బేతోలు శివారు భజన తండా సమీపంలో చోటుచేసుకుంది.. పోలీసులు, బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. జిల్లాలోని బయ్యారం మండలం జగత్ రావు పేట జీపీ పరిధిలోని బోటి తండాకు చెందిన మాలోత్ సురేశ్, అతడి అన్న గణేశ్, వదిన అమలాదేవి (27), వారి ఇద్దరు కుమారులు నాలుగేళ్ల గౌతమ్, ఏడాదిన్నర వయసుగల గగన్, అక్కాబావ బానోత్ రంగ్య, మంజుల ఓ ఆటోలో కురవి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి బేతోలు శివారు భజన తండా దాటుతుండగా ముందునుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు సడన్ బ్రేక్ వేయడంతో ఆ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అమలాదేవికి తీవ్ర, మిగతా వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న 108 వాహనం క్షతగాత్రులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అమలాదేవిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని ధ్రువీకరించారు. కాగా, మంగళవారం తమ ఇంటి వద్ద ఎల్లమ్మ పండుగ చేసుకోనున్న నేపథ్యంలో కురవిలోని అంగడిలో మేకను కొనుగోలు చేయడానికి వారంతా ఆటోలో వెళ్తున్నట్లు బంధువులు పేర్కొన్నారు. కుమారులు గౌతం, గగన్.. తల్లి అమలాదేవి కనిపించకపోవడంతో వెక్కివెక్కి ఏడుస్తుండగా వారిని ఆపడం ఎవరితరం కాలేదు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కురవి ఎస్సై గండ్రాతి సతీశ్, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.



భార్య అమలాదేవి మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త గణేశ్



అమలాదేవి(ఫైల్)

నిందితులను కఠినంగా శిక్షించాలి

● మృతుడి కుటుంబీకుల డిమాండ్
● కుమారస్వామి మృతదేహంతో ఆర్టీఏ జంక్షన్ వద్ద ఆందోళన

ఖిలా వరంగల్: తన భూమిని కబ్జా చేశారంటూ వరంగల్ కరీమాబాద్కు చెందిన పోలెపాక కుమారస్వామి(55) మనస్తాపంతో ఈనెల 9వ తేదీన శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో హైదరాబాద్లో ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందగా.. సోమవారం సాయంత్రం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ వద్ద కుమారస్వామి మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. కబ్జాకు పాల్పడిన బండి కుమారస్వామి, పులి రంజిత్ రెడ్డి, తాళ్ల మల్లేశంను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ విషయం తెలిసిన మామునూరు, మిల్స్కాలనీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.



మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన మృతుడి కుటుంబ సభ్యులు

భార్యపై బెంగతో యువకుడి ఆత్మహత్య

● ఎల్కతుర్తిలో ఘటన ● మృతుడు రాజస్థాన్ వాసి

ఎల్కతుర్తి: ఏడు నెల గర్భవతి అయిన తన భార్యను దగ్గరుండి చూసుకోలేకపోతున్నాననే (సపర్యలు) బెంగతో ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శివారులోని జై బాలాజీ స్టోన్స్లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్కుమార్ కథనం ప్రకారం.. రాజస్థాన్లోని గోగవస్ సికర్ జిల్లాకు చెందిన రాజేంద్రకుమార్ జాకర్ (21) రెండు నెలల క్రితం ఎల్కతుర్తి వచ్చి జై బాలాజీ స్టోన్స్లో హెల్పర్గా పనిచేస్తున్నాడు. తన భార్య 7నెలల గర్భవతి. ఈ సమయంలో తన దగ్గరుండి చూసుకోలేకపోతున్నానని కొన్ని రోజులుగా స్నేహితులతో చెప్పుకుని మదనపడేవాడు. ఈ విషయంపై మనస్తాపం చెందిన రాజేంద్రకుమార్ జాకర్ సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యాపారి..

ఎస్ఎస్తాడ్వాయి : అప్పుల బాధతో ఓ గాజుల వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా ముస్తాబాద్కు చెందిన పిల్లి సత్యం(50), జ్యోతి దంపతులు 12 సంవత్సరాల నుంచి మేడారంలో గాజుల దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సత్యం వ్యాపారం కోసం రూ. 10 లక్షల అప్పు చేశాడు. వ్యాపారం సరిగా నడవకపోవడంతోపాటు అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈక్రమంలో సోమవారం దుకాణం వెనుక రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై శ్రీకాంత్రెడ్డి తెలిపారు.

నమిలిగొండలో విషాదఛాయలు

● గ్రామానికి చెందిన ప్రేమజంట భువనగిరిలో ఆత్మహత్య

స్టేషన్ఘన్పూర్: గ్రామంలో వారివి సమీప ఇళ్లు. హైస్కూల్, ఇంటర్ చదువులు నమిలిగొండ శివారులోని మోడల్ స్కూల్లో చదివారు.. ఇద్దరూ ఒకే తరగతి వారు కావడంతో స్నేహం కాస్త ప్రేమగా మారింది. కానీ, కులాలు వేరు కావడంతో తమ ప్రేమను పెద్దలు అంగీకరించలేదని జనగామ జిల్లా స్టేషన్ఘన్పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన ప్రేమజంట కోటి వినయ్కుమార్(25), మచ్చ శృతి(23) ఆదివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అందరితో కలివిడిగా ఉండే వినయ్కుమార్, శృతి ఆత్మహత్య చేసుకున్నారనే సమాచారంతో సోమవారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అమ్మాయి సాఫ్ట్వేర్.. అబ్బాయి ప్రైవేట్ ఉద్యోగి

నమిలిగొండ గ్రామానికి చెందిన కోటి రాజయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు వినయ్కుమార్, మచ్చ కుమారస్వామి, రేణుక దంపతుల కుమార్తె శృతి బాల్యం నుంచే స్నేహితులు. శృతి బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్లో విప్రో కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తోంది. వినయ్కుమార్ జనగామ పిన్కేర్ బ్యాంకులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరి ప్రేమను ఒప్పుకోకపోవడంతోపాటు శృతికి ఇంటిలో వేరే పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుసుకున్న వినయ్కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. ఇక ఎప్పటికీ తమ పెళ్లికి పెద్దలు అంగీకరించరనే ఆవేదనతో ఇద్దరు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గ్రామంలో విషాదఛాయలు

భువనగిరిలో పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను వేర్వేరుగా అంబులెన్స్లలో గ్రామానికి తరలించారు. వారివారి ఇళ్ల వద్దకు మృతదేహాలను చేర్చగానే మృతుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించాయి. ఛిద్రమైన మృతదేహాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు చేసిన రోదనలు మిన్నంటాయి. అనంతరం శృతి, వినయ్కుమార్ల అంత్యక్రియలు వేర్వేరుగా వారి కుటుంబసభ్యులు చేపట్టారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ జి.వేణు ఆదేశాల మేరకు ఎస్సై వినయ్కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో బందోబస్తు చేపట్టారు.



రోదిస్తున్న శృతి తల్లి, కుటుంబ సభ్యులు



విలపిస్తున్న వినయ్కుమార్ తల్లి, బంధువులు